సాక్షి
రంగారెడ్డి
శనివారం ၊ 6 ၊ ఏప్రిల్ ၊ 2024



బీజేపీకి షాక్

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ ఆ పార్టీని వీడి సొంత గూటికి చేరడం చర్చగా మారింది. 10లో▸



అందుబాటులో ఉంచాలి

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సందర్శించారు. 10లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శనివారం సాయంత్రం 6:36	ఆదివారం ఉదయం 4:43

న్యూస్‌రీల్

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

కేశంపేట: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని కూలీలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని బోధునంపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. అనంతరం వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. వేసవిలో ఎండ వేడిమి నుంచి జాగ్రత్త ఉంటూ పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం లేమామిడి, కొండారెడ్డిపల్లి, అల్వాల గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీచరణ్ గౌతమ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఓ అజీజ్, టిఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మేక్ ఇండియా విప్లవంలో ముందుండాలి



పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న జయేష్ రంజన్

తుక్కుగూడ: రాష్ట్రంలోని సూక్ష్మ, స్థూల పరిశ్రమలు మేక్ ఇండియా విప్లవంలో ముందుండాలని రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. తుక్కుగూడ ఈ–సిటీలో ప్రముఖ స్వదేశీ ఆడియో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ మివి ఆవిష్కరణ్ పరిశ్రమ ఏర్పాటుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఆడియో రంగంలో ఏకైక తయారీ సంస్థగా మివి కంపెనీ వెలుగొందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మివి సీఎంఓ మిధుల దేవాబతుని, కో ఫౌండర్ కె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్‌కు అలవాటు పడి తండ్రిని అతిదారుణంగా హత్య చేసిన కొడుకును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అరెంజ్ అవెన్యూలో నివసించే తిరుపతి రవీందర్‌ను కన్న కొడుకు అనురాగ్ పెట్రోల్‌పోసి నిప్పంటించి, రాయితో మోది చంపిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న అనురాగ్‌ను ఆదిబట్ల పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకుని అరెస్టు చేసి శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తండ్రి పట్టించుకోకపోవడంతోనే హత మార్చినట్లు పోలీసుల విచారణలో తెలిపినట్లు తెలిసింది.

ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధి కమిటీలు

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ఫిలింనగర్: లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు డివిజన్ స్థాయి నుంచే అభివృద్ధి కమిటీలు వేస్తామని ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దాన నాగేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నామన్నారు. డివిజన్‌కు అయిదు మందితో ఓ కమిటీ వేస్తామని అందులో ఒక ఎస్సీ కూడా ఉంటారని అన్నారు. ఈ కమిటీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్హులైన వారికి అందించేందుకు పని చేస్తుందన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఏం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. లోక్‌సభ నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధి గురించి చెప్పి ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, బీజేఆర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు నల్లపు యాదగిరి, నడిమింటి కృష్ణ, గౌరెంటి యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనజాతరకు రెడీ

అన్ని దారులూ తుక్కుగూడ వైపే..

- ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా ప్రముఖుల రాక
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న పార్టీ శ్రేణులు
- పూర్తయిన ఏర్పాట్లు.. భారీ బందోబస్తు
- సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- సభాస్థలిని పరిశీలించిన దీపాదాస్ మున్షి, ఇతర మంత్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జన జాతరకు సర్వం సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన సభను టీపీసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీ, ఖర్గే సహా ఇతర ముఖ్య నేతలంతా హాజరుకానుండడంతో భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెప్టెంబర్ 17న ఇదే వేదిక నుంచి ఆరు గ్యారంటీలను ప్రకటించించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చిన తుక్కుగూడను జాతీయ ఎన్నికల శంఖారావానికి వేదికగా చేసుకుంది. ఈ వేదిక నుంచే జాతీయ స్థాయిలో ఐదు గ్యారంటీలను ప్రకటించనుంది. సభకు ఏఐసీసీ ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు హాజరవుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సుమారు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. ఇటు శంషాబాద్ నుంచి ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 వరకు.. అటు పహడిషరీఫ్ నుంచి తుక్కుగూడ శివారు వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు సహా శ్రీశైలం జాతీయ రహదారిపై సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.



సిద్ధమైన సభావేదిక

సభాస్థలిని పరిశీలించిన దీపాదాస్ మున్షీ

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి తరలి వచ్చే వారికి ఆహ్వానం పలికేందుకు నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం మొదలు.. నార్సింగి, రాజేంద్రనగర్, తుక్కుగూడ, రావిర్యాల, కొంగరకలాన్, బొంగ్లూరు జంక్షన్ సహా శ్రీశైలం, నాగార్జునసాగర్, విజయవాడ జాతీయ రహదారుల వెంట భారీగా కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. దారి పొడవునా కాంగ్రెస్ జెండాలు, తోరణాలు కట్టారు. వడదెబ్బబారిన పడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే సీఎం రేవంత్ సహా మంత్రులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాజాగా శుక్రవారం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు సభాస్థలిని సందర్శించారు.

సభను విజయవంతం చేయండి

జనజాతర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ, పార్టీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తుక్కుగూడ సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకుం కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డమీద నుంచి కాంగ్రెస్ పార్టీ ‘జంగ్ సైరన్’ మోగించనుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ 14 స్థానాలు గెలుస్తుందని.. చేవెళ్లలో బంపర్‌మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

పెద్ద ఎత్తున ఏర్పాట్లు

ఫ్యాబ్‌సిటీకి వెళ్లే మార్గంలో ఖాళీగా ఉన్న 25 ఎకరాల విస్తీర్ణంలో భారీ ప్రధాన వేదికను ఏర్పాటు చేశారు. దానికి ఇరువైపులా మరో రెండు వేదికలను సిద్ధం చేశారు. పూర్తిగా ఓపెన్ ఎయిర్ స్టేజీలను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ఖర్గే, ప్రియాంకగాంధీ సహా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఆసీనులు కానున్నారు. ముఖ్య నేతలతో పాటు మంత్రులు పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రధాన వేదికకు ఎడమ వైపు ఉన్న స్టేజీని కళాకారులకు, కుడివైపు ఉన్న వేదికను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులకు కేటాయించారు. వేదిక వెనుక భాగంలో భారీ ఎల్‌సీడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. వేదిక ముందు భాగంలో నాలుగు గ్యాలరీలను ప్రత్యేకంగా మహిళల కోసం కేటాయించారు. సభాస్థలికి వచ్చి వెళ్లే ప్రధాన మార్గాలతో పాటు వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాల్లోనూ లైటింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు.

సభా ప్రాంగణంలో పార్టీ నేతల కటౌట్లు





మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

రైతులను ఆదుకోవడంలో విఫలం

- మాయమాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించింది
- రైతు సత్యాగ్రహ దీక్షలో బీజేపీ నేతల విమర్శలు

ఇబ్రహీంపట్నం రూరల్: కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. వారిని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి బొక్క నర్సింహారెడ్డితోపాటు మాజీ ఎంపీ, పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు పాపయ్యగౌడ్, అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన వారు అమలు చేయకపోవడంతో రైతులు అప్పులపాలయ్యారన్నారు. ఎకరానికి పంట నష్టం రూ.25వేలు నేటికీ ఊసే లేదన్నారు. వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్, నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తామని మాట తప్పారన్నారు. రైతు కూలీలకు రూ.12,500 ఇస్తామని, ధరణి పూర్తిగా ప్రక్షాళన చేస్తామని విస్మరించారన్నారు. రైతుబంధు ఎకరానికి రూ.15వేలు వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఇకనైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, దళితమోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష, బోసుపల్లి ప్రతాప్, నాయకులు పోరెడ్డి నర్సింహారెడ్డి, లచ్చిరెడ్డి, అశోక్‌గౌడ్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారయణ, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ యాదవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బడుగుల నేతకు బాలిక పుష్పాంజలి

భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణించారు. ఇక్కడే ఓ చిన్నారి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం కనిపించింది.



వలస వచ్చి.. ప్రాణాలు విడిచి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికుల మృతి

షాద్‌నగర్‌రూరల్: పొట్టకూటి కోసం వలస వచ్చారు.. పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.. అనారోగ్యంతో ఓ కార్మికుడు తన మిత్రుడితో కలిసి వైద్యుడి వద్దకు వెళ్లాడు.. తిరుగు పయనంలో రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర ఘటన షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శరత్‌కుమార్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేష్ పరిహార్ (38), దినేష్ పరిహార్ కొంత కాలం క్రితం షాద్‌నగర్‌కు వలస వచ్చారు. ఇద్దరూ ఎలికట్ట గ్రామ శివారులోని ఓ మిర్చి పరిశ్రమలో పని చేస్తూ కుటుంబాలతో కలిసి పరిశ్రమ ఆవరణలోనే నివాసం ఉంటున్నారు. దినేష్ పరిహార్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో తన స్నేహితుడైన రాజేష్ పరిహార్‌తో కలిసి శుక్రవారం ఉదయం మొగిలిగిద్దలోని ఆస్పత్రికి చికిత్స కోసం ద్విచక్రవాహనంపై వెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి పరిశ్రమకు వస్తున్నారు. మార్గ మధ్యలో ఎలికట్ట శివారులో ఉన్న టోటల్ గ్యాస్ సమీపంలో వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేష్‌పరిహార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన దినేష్ పరిహార్‌ను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దినేష్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఐ శరత్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు దినేష్‌పరిహార్ భార్య కుసం పరిహార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దినేష్ పరిహార్, రాజేష్ పరిహార్ మృతదేహాలు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

తుర్కయంజాల్: దేశంలోని కార్మికచట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా మార్చి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య విమర్శించారు. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో దేశంలోని సగం జనాభా దారిద్ర్యరేఖకు దిగువనే ఉండటం బీజేపీ పాలనకు నిదర్శనం అని అన్నారు. ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో అనేక కార్పొరేట్ కంపెనీల నుంచి కోట్ల రూపాయలను ఆ పార్టీ దండుకుందని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డ అందరినీ శిక్షించకుండా బీజేపీలో చేరిన వారిని వదిలి పెడుతూ మిగిలిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు.కార్మికులంతా ప్రస్తుత రాజకీయ పరిస్థితులను తెలుసుకుని దానికి అనుగుణంగా నడవాలని సూచించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు రుద్రకుమార్, రవి కుమార్, కీసరి నర్సిరెడ్డి, డి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

భలే బల్దియా!



అధికార బలం తక్కువ..

- ప్రతిపక్షాల బలం ఎక్కువ!!
- మేయర్, డిప్యూటీ మేయర్ జంపింగ్‌తో..
- జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: మున్సిపల్ కార్పొరేషన్లలో ఏ పార్టీ సభ్యులెక్కువగా ఉంటే ఆ పార్టీ వారు మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల్లో ఉంటారు. ఇది సాధారణం. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో మేయర్, డిప్యూటీ మేయర్‌ల పార్టీ సభ్యులు తక్కువగా ఉన్నారు. మిగతా పార్టీల సభ్యులు ఎక్కువమంది ఉన్నారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత బీఆర్ఎస్ కార్పొరేటర్లుగా గెలిచి.. ఆ పార్టీ సభ్యుల బలంతో మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. వారి ఎన్నిక జరిగినప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం.. ఇటీవల వారు ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. జీహెచ్ఎంసీ నిబంధనల మేరకు ఒకసారి మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యాక నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేదు. దీంతో వారు ఏ పార్టీలోకి మారినా వారి పదవులకు ముప్పు లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ గెలిచింది కేవలం రెండు స్థానాలే. మారిన రాజకీయ పరిణామాలతో ప్రస్తుతం ఆ పార్టీ సభ్యుల బలం 15కు చేరువలో ఉంది. అయినప్పటికీ మిగతా పార్టీల సభ్యుల బలం కంటే దాని బలం చాలా తక్కువ. దాదాపుగా బీఆర్ఎస్‌కు 50, బీజేపీకి 40 మంది సభ్యుల బలం ఉండగా.. ఎంఐఎంకు 42 మంది ఉన్నారు. పాలకమండలి సమావేశం నిర్వహించేది, సభకు అధ్యక్షత వహించేది మేయరే అయినప్పటికీ.. కాంగ్రెస్ సభ్యులు మిగతా పార్టీల సభ్యుల కంటే తక్కువ కావడంతో ఏ అంశమైనా ఆమోదం పొందాలంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

స్టాండింగ్ కమిటీలో స్థానమే లేదు

- జీహెచ్ఎంసీలో ఎంతో కీలకమైన స్టాండింగ్ కమిటీలో కాంగ్రెస్‌కు స్థానమే లేదు. మొత్తం 15 మంది సభ్యుల్లో బీఆర్ఎస్ సభ్యులు 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు ఉన్నారు. జీహెచ్ఎంసీలో ఏ పాలసీ అమలు చేయాలన్నా స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరి. అంతేకాదు.. రూ. 2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు విలువైన పనులు చేపట్టాలంటే అందుకు స్టాండింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో.. మేయర్ డిప్యూటీ మేయర్ అధికార కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ, జీహెచ్ఎంసీ చేపట్టే పనుల్లో బీఆర్ఎస్, ఎంఐఎంల మాటే చెల్లుబాటయ్యే పరిస్థితి ఉంది. ఎంఐఎం ఇప్పటి వరకు బీఆర్ఎస్‌తో పరస్పర సహకారంతో పనిచేస్తోంది. అంతమాత్రాన కాంగ్రెస్‌తో శత్రుత్వం లేదు.
- ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీలో ఎంఐఎం వైఖరి ఎలా ఉండబోతోందన్నది ముున్ముందు వెల్లడి కానుంది. స్టాండింగ్ కమిటీ కాల పరిమితి ఏడాది. కొత్త స్టాండింగ్ కమిటీ ఏర్పడి నెల మాత్రమే దాటింది. కొత్త కమిటీ ఎన్నికకు దాదాపు 11 నెలల సమయముంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులు, పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్తేనే ఆ పార్టీ మాట చెల్లుబాటయ్యే పరిస్థితి ఉంటుంది. లేని పక్షంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా, మేయర్, డిప్యూటీ మేయర్ ఆ పార్టీవారే అయినా ఇబ్బందులు తప్పవు. పనుల్లో అలసత్వం, అవినీతి, నిధుల దుబారా వంటి వాటిని ప్రతిపక్షాలు లేవనెత్తుతాయి. ఇటీవల మేయర్ దాదాపు రూ. 1.45 లక్షలతో యాపిల్ ఐప్యాడ్ కొనుగోలుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇలాంటి వాటినీ అడ్డుకునే పరిస్థితి ఎదురవుతుంది.

బలోపేతం దిశగా..

వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకునే కాబోలు ఎక్కువమంది కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ ఆకర్ష్ మంత్రాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితోపాటు మరి కొందరికి ఆ బాధ్యతలు అప్పగించినట్లు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోపుగానే దాదాపు 30 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరిగింది. మిగతా పార్టీల కంటే తమ పార్టీ సభ్యుల బలం ఎక్కువగా ఉంటేనే జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ మాట చెల్లుబాటవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే అటు ఎమ్మెల్యేలతో పాటు ఇటు కార్పొరేటర్లపైనా కాంగ్రెస్ వల విసురుతోందని రాజకీయ పరిశీలకులంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కొందరు ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే వారితో పాటు వారి నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశముంది.

ఫ్రై డే

సాక్షి, సిటీబ్యూరో: భానుడు ఉగ్ర రూపం దాలుస్తున్నాడు. మహానగరంలో సాధారణం కంటే మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతల నమోదవుతుండటంతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఉష్ణతాపం కనిపిస్తోంది. 10 గంటల తర్వాత బయటకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర పనులపై బయటకు వెళ్లినవారు వడగాలులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వడదెబ్బ బారినపడుతున్నారు. శివారులో సగటున గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటగా.. నగరం మాత్రం 42 పైనే రికార్డు అవుతోంది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు.



సీతక్కను సన్మానించిన మేయర్


మంత్రి సీతక్కను సత్కరిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు మంత్రిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న గుట్ట పైన ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన వెంకటయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజిపేట మండలం బాజీపూర్ గ్రామానికి చెందిన జీనుకుంట్ల ప్రశాంత్‌లు అనుమతులు లేకుండా కంప్రెషర్‌తో బండలను బ్లాస్టింగ్ చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం ఇరువురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి


బడంగ్‌పేటలోని గ్రంథాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ మేరకు గంథ్ర పాలకుడిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమయిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సరిపడా తాగునీరు, ఇంటర్‌నెట్, కంప్యూటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి షాక్

- కాంగ్రెస్‌లోకి కూన శ్రీశైలంగౌడ్
- సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షి సమక్షంలో చేరిక


రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్‌రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రోజు రోజుకు మారుతున్నాయి.. నిన్న నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరగా తాజాగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ ఆ పార్టీని వీడి సొంతగూటికి చేరడంతో నియోజకవర్గంలో చర్చగా మారింది. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి నియోజకవర్గంలో చరిత్ర సృష్టించిన కూన శ్రీశైలంగౌడ్ అనంతరం కాంగ్రెస్ పార్టీ అనుబంధంగానే పని చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో జరిగిన రాజకీయ పరిణామాలతో బీజేపీలో చేరేగా ఆ పార్టీలో మల్కాజిగిరి ఎంపీ టికెట్ విషయంలో వచ్చిన విభేదాల వల్ల తిరిగి సొంతగూటికి రావాలని శ్రీశైలంగౌడ్ నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలు గురువారం శ్రీశైలంగౌడ్‌తో చర్చించి శుక్రవారం ఏఐసీసీ ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతంత మాత్రం గానే ఉన్న బీజేపీ కూన వెళ్లిపోవడంతో ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌కు గట్టి షాక్ తగిలినట్లు అయింది.

రెండు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో...

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల నుంచి ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం అవుతుండగా... నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి పలువురు కార్పొరేటర్లు గురువారం పార్టీలో చేరగా సుమారు 20 మందికి పైగా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరేందుకు రెడీగా ఉన్నారు. గ్రేటర్ పరిధిలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్లో ఉన్న మొత్తం ఎనిమిది మంది కార్పొరేటర్లలో ఏడుగురు కార్పొరేటర్లు ఇప్పటికే మాజీ మంత్రి మహేందర్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేసుకొని త్వరలోనే ముహూర్తం చూసుకొని వస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఎవరూ ఊహించి ఉండరు..

- మంచి పట్టున్న నాయకుడిగా ఉన్న శ్రీశైలం గౌడ్ గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో లక్షకుపైగా ఓట్లు సాధించి రెండో స్థానంతో నిలిచాడు. ఎన్నడూ లేనివిధంగా ఆయన అత్యధికంగా బీజేపీకి ఓట్లు పోలయ్యేలా కష్టపడ్డారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోగా 10 వేల నుంచి 20వేల ఓట్లు దాటలేదు. బలమైన పేరున్న కూన పోటీ చేయడంతో ఏకంగా లక్షకు పైగా ఓట్లు పోల్ కావడం విశేషం.

విజయాన్ని మోదీకి బహుమతిగా ఇవ్వాలి


మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: దేశ ప్రధాని నరేంద్ర మోదీని మూడోసారి గెలిపించాలని... మల్కాజ్‌గిరిలో తనను గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలని ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సూరారం టీఎస్‌ఐఐసీ కాలనీ, గాజులరామారం ఉషోదయ కాలనీల్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు, వాణినగర్ మోదీ అపార్ట్‌మెంట్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్నారని అన్నారు. తన స్వార్థం కోసం వలసలను ప్రోత్సహిస్తున్నాడన్నారు. నరేంద్ర మోదీ 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఐదో స్థానానికి తీసుకొచ్చి చూపించారు. భారత దేశమే కాదు ప్రపంచ దేశాలు మోదీ వైపు చూస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ బలమైన ఉత్తరప్రదేశ్ స్థానాన్నే కోల్పోయిందన్నారు. అందుకే రాహుల్‌గాంధీ అక్కడ గెలవలేక కేరళకు వచ్చి పోటీ చేస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజలకు సేవ చేసుకుంటానని అన్నారు. కేంద్ర నిధులతో పార్లమెంట్‌లోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలు బీజేపీ జెండా ఎగురవేసే విధంగా పని చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమ్మాతుల్ విదా సందర్భంగా పాతబస్తీ మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్, చార్ కమాన్ గ్రానైట్ రోడ్లపై ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యలు బందోబస్తును పర్యవేక్షించారు. చార్మినార్



విద్యుత్ వైర్ల దొంగ అరెస్టు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్ల సర్వీస్ వైర్ల చోరీకి పాల్పడిన ఓ దొంగను గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆకులమైలారం తదితర గ్రామాల్లో నాలుగు రోజుల కిందట కందుకూర్ మండలం తుమ్మలూర్ గ్రామానికి చెందిన జంగారెడ్డి అర్ధరాత్రి వేళ బోరుబావుల మోటార్ల వైర్ చోరీకి పాల్పడుతున్నాడు. ఆ సమయంలో ఆయన తన బైక్‌ను రోడ్డుపై వదిలి వెళ్లగా రైతులు ఫొటో తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన జంగారెడ్డిని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపనున్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన శుక్రవారం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. సుమారు 48 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు తెల్లని షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంట్, ఎర్రని చెప్పులు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

అనారోగ్యంతో గురుస్వామి మృతి


వీరస్వామి (ఫైల్)

మహేశ్వరం: మామిడిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ అయ్యప్ప గురుస్వామి కోట్ల వీరస్వామి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా మాలధారణ చేస్తున్న పరిసర గ్రామాల అయ్యప్ప భక్తులకు ఆయన సుపరిచితుడు. మరణ విషయం తెలుసుకున్న భక్తులు ఎంతో మంది ఆయనతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఆయన చేతులు మీదుగా మాలధారణ చేసుకోవడం అదృష్టంగా పేర్కొన్నారు. వీరస్వామికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. శనివారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

వ్యక్తి అదృశ్యం


నవీన్ (ఫైల్)

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌కి చెందిన ఓ మిర్చిబండి వ్యాపారి అదృశ్యమైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని రావిచేడ్‌కి చెందిన నవీన్ (36) కేశంపేట్ మండల కేంద్రంలో మిర్చిబండి నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజూ మాదిరిగానే ఈనెల 1వ తేదీన మిర్చిబండి పెట్టేందుకు రావిచేడ్ నుంచి కేశంపేట్‌కు బయలుదేరాడు. అయితే తిరిగి ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువు ఇళ్లతో పాటు, సమీప గ్రామాల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. శుక్రవారం నవీన్ భార్య శైలజ కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


రాములు మృతదేహం

చేవెళ్ల: అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసానిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ద్యావరి రాములు(35) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బావిలో రాములు శవమై తేలాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది బావిలో దూకి మృతి చెందినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో నిందితులకు రిమాండ్

చర్లపల్లి జైలుకు తరలింపు


నిందితులు దేవ్, మల్లేశ్

కడ్తాల్: పాత కక్ష్యలు మనస్సులో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పెద్దవేములోనిబావి తండాకు చెందిన రమావత్ దేవ్యా అలియాస్ దేవ్, గడ్డమీదితండాకు చెందిన విస్లావత్ మల్లేశ్‌కు.. పెద్దవేములోని బావితండాకు చెందిన రమావత్ రాజేందర్‌తో గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. అవి మనస్సులో పెట్టుకున్న దేవ్, మల్లేశ్.. ఈ యేడాది ఫిబ్రవరి 27న రాజేందర్‌పై కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయమై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితులు దేవ్, మల్లేశ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని మహేశ్వరం కోర్టులో హాజరుపర్చగా వాదనల అనంతరం న్యాయమూర్తి.. నిందితులకు రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించారు. వారిని చర్లపల్లి జైలుకు తరలించామని ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

స్వార్థంతోనే పార్టీని వీడారు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ నాయకులు స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరారని, వారి తీరు దివాల కోరుతనానికి నిదర్శనమని జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌లు పేర్కొన్నారు. శుక్రవారం సాదత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎన్నో నిధులు విడుదల చేయించారన్నారు. రూ.400 కోట్ల నిధులతో మంచినీటికి సంబంధించిన రిజర్వాయర్లు, పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పించినప్పటికీ, కొందరు నాయకులు పార్టీని వీడడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంజద్ ఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాకీర్, అబ్దుల్లా గాలిబ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో బెంగుళూర్ నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిచేందుకు ప్రయత్నిస్తూ చిక్కాడు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ శుక్రవారం కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు చెందిన జయచంద్ (26) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన అతను ఎస్‌ఆర్‌నగర్‌లో ఓ లాడ్జిని నిర్వహించి అప్పుల పాలయ్యాడు. అనంతరం ఓ సంస్థలో ఉద్యోగం చేశాడు. జీతం చాలకపోవడంతో ఇసుక రవాణా దందా నిర్వహించాడు. అప్పులు పెరిగిపోవడంతో పాటు గంజాయి, మత్తు మందులకు అలవాటు పడ్డాడు. బెంగుళూర్‌లో ఓ వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తాడని తెచ్చుకొని నగరంలో విక్రయిస్తే మంచి లాభాలు ఉంటాయని ఓ స్నేహితుడు సలహా ఇచ్చాడు. దీంతో బెంగళూరు వెళ్లిన జయచంద్ 2 గ్రాములు మత్తు పదార్థాన్ని తీసుకొచ్చాడు. దానిని తానే వినియోగించాడు. గత నెల 26 మరోసారి బెంగుళూర్‌కు వెళ్లి 20 గ్రాముల డ్రగ్స్ తీసుకొచ్చాడు. 5 గ్రాములు తాను వాడుకుని 15 గ్రాములను విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి సన్‌సిటీలోని నివాసంలో మత్తు పదార్థాన్ని దాచినట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేసి జయచంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 15 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కాల్ డేటా ఆధారంగా బెంగుళూర్‌లో ఎవరు విక్రయించారు... ఎవరెవరికి విక్రయించారో పూర్తి వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం, సోలిపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి జనార్దన్‌రెడ్డి(68), జానమ్మ దంపతులు శంషాబాద్‌లోని కుమార్తె ఇంటికి వచ్చారు. శుక్రవారం స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు జానమ్మ బస్సులో బయలుదేరగా, జనార్దన్ రెడ్డి స్కూటీపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మదన్‌పల్లి శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొంది. తీవ్ర గాయాలైన జనార్దన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి


మాట్లాడుతున్న శ్రీధర్

హుడాకాంప్లెక్స్: కార్యకర్తలు సమష్టిగా పనిచేసి చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సరూర్‌నగర్ లోక్‌సభ ఇన్‌చార్జి శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ పార్టీ కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అనంతరం కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 15వేల మెజారిటీ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ కన్వీనర్ ఆకుల అంజన్‌కుమార్, కో కన్వీనర్ జైన్‌బాబు, కాటమరాజు పాల్గొన్నారు.

సొత్తుతో పాటు కుక్క పిల్లనూ ఎత్తుకెళ్లారు

ఘట్‌కేసర్: పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డారు. సొత్తుతో పాటు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న శునకాన్ని సైతం ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్ బాలాజీ నగర్‌కు చెందిన ఐలయ్య గురువారం కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండ జిల్లా అంబాల గ్రామంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా అల్మరా తాళం పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులో దాచిన 7.5 గ్రాముల బంగారం, 11 తులాల వెండి రూ. 5 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. వీటితో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుక్కపిల్లను కూడా అపహరించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం (వేలి ముద్రల నిపుణులు)తో కలిసి వివరాలు సేకరించారు. బాధితుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.